
# ధర్మంచెర



యం. ఉమామహేశ్వరరావు

**కొత్త చీర** కట్టుకుని మురిసి పోతున్న సామాన్య గృహిణిలా ఎర్రటి సింధూరం రంగు వలువను చుట్ట బెట్టుకుని మురిసిపోతూంది ఆకాశం.

చల్లటి గాలులు వీస్తున్నాయి. ఇంటి ముందున్న జామిచెట్టు మీద రామచిలుక ఒకటి సగం కొరికిన జామకాయ రాలి పచ్చటి చిరుగడ్డి రేకుల కింద పడి చప్పుడు చేయకుండా లోనెక్కడా దాగి పోయింది.

వీధి వరండాలో వాలు కుర్చీలో కూర్చుని వీధి వేపు చూస్తున్నాడు బంగార్రాజు. అతని నోట్లో వెలుగుతున్న లంక పొగాకు చుట్ట తన పని తాను చేసుకుంటూ పోతూంది. లోపల గదిలో ఉన్న రేడియోలోంచి సాయంత్రం ప్రసారం ప్రారంభం కాబోతూ, సన్నని వాయిద్యం చెవుల కింపుగా వినపడుతూంది. కుర్చీలో విలాసంగా కూర్చుని చూస్తున్న బంగార్రాజు వీధి తలుపు కున్న చెక్క గేటు 'కిర్రు' మంటూ చప్పుడు చేయడంతో చటుక్కున అటు చూశాడు.

గేటు తలుపు తోసుకుని వస్తూన్న ఆ మనిషి కనిపించాడు. మనిషి బాగా నీరసించి ఉన్నాడు. చిరిగి, మాసికలు పడ్డ చొక్కా, చేతిలో సత్తుగిన్నె, మరో చేతిలో కర్ర—కుంటి కాలుతో ఆ మనిషి తిన్నగా సరాసరి బంగార్రాజు వద్దకు మెక్కుకుంటూ వచ్చి ఎదరగా నించున్నాడు. అతని కేసి దృష్టి మరల్చాడు బంగార్రాజు.

''దండాలు బాబూ!'' ఆ మనిషి వంగి వినయంగ పెడుతున్న ఆ దండం వెనక ఏ అరదండమైనా ఉందేమోనని కాస్సేపు ఆగి చూశాడు. ఆ మనిషింకా వంచిన తల ఎత్తలేదు.

''నువ్వు ఇక్కడి కెందుకొచ్చావురా ముష్టి వెధవా? బంగార్రాజు గొంతు కర్కశంగా వినిపించింది ఆ మనిషికి. కోపం వచ్చింది. అయినా తమాయించు కున్నాడు. ఆ వూరి పెద్ద బంగార్రాజు మీద కోపమా? అగ్నిశిఖలతో తలపడ్డమా?

ఆగిపోయా డొకింత సేపు.

''తమతో సిన్న మనవి ఉన్నాదండి! ఆ మనవి సేసుకుని ఎల్లిపోతాను.''

నిలువెల్లా మెలికలు తిరిగి పోతూ అన్నాడా మనిషి.

''ఏటి చెప్పు!'' విసుగ్గా అడిగాడు బంగార్రాజు.

''ఏటివేదండి. మనూరి దేవుడి గుడికాడ నేను కూర్చుని రోజూ అడుక్కుంతానని తమకు తెలుసును గదా!'' అన్నాడు.

''అయితే ఏవయ్యిందిరా?'' అడిగాడు బంగార్రాజు.

''ఏళ్నేదు, బాబయ్యా! నిన్న వేలొకడు వచ్చి నన్ను తన్ని ఆ డక్కడ కూర్చున్నాడండి. నా ఆదాయం నా నోట్లో మట్టి గొట్టేడండి! తమరి తోటి సెబుతానని అన్నానండి. పోయి నీ బావుతో సెప్పుకో! అన్నాడండి'' ఆగేడా వ్యక్తి.

బంగార్రాజు గుండెలు గుబేలుమన్నాయి. వాలు కుర్చీలో కూర్చున్న వాడల్లా తిన్నగా కూర్చున్నాడు.

''ఏట్రా! ఏవన్నాడూ? మళ్ళీ చెప్పు.''

''ఏటుందండి! నీబావుతో సెప్పుకో అన్నాడండి! మళ్లా నోరెత్తితే, ఇది దేవుడి గుడి. ఇక్కడ కాలీ ఉన్న సోట కూరుసుంటే ఒద్దని అనడానికి ఎవు డొత్తాడో రానీ, నానూ సూస్తానని అన్నాడండి!'' నసుగుతూ చేతులూపుతూ చెప్పే డా వ్యక్తి.

బంగార్రాజు వూగిపోయాడు.

కోపంతో నిలువెల్లా వూగిపోయాడు. ఒళ్ళంతా ఆగ్రహోద్రగ తాగ్నులు మంట పెడుతూండగా, నిలుచున్న ఫళంగా వేడెక్కిపోతూ కళ్ళల్లో నిప్పులు రాల్చాడు.

''చూస్తాను. చూస్తా్రనా! వాడెవడో? ఎక్కడి నుంచివచ్చాడో తేలుస్తాను. నన్నేఖాతరు చెయ్యకుండా మాట్లాడేడూ అంటే వాడి సంగతి చూడాలిసిందే. నువ్వెళ్ళు, నువ్వెళ్ళి అక్కడే కూర్చో. నేనుతెల్లార బోయేసరికి వచ్చి, వాడి సంగతి తేల్చేస్తాను.'' అభయం ఇచ్చేశాడు బంగార్రాజు.

ఆ అభయముద్ర చూడగల్నే ఆ కుంటి వ్యక్తి ముఖం సంతోషంతో వెలిగిపోయింది. ''మారాజులు పది కాలాల పాటు సల్లగుండాల!'' అంటూ కదల బోయాడు.

"రేపు నే నొచ్చి చూసేదాకా వాడితో ఏవీ తగు వెట్టుకోకు!" హెచ్చరించాడు బంగార్రాజు.

ఆ కుంటి వ్యక్తి 'అలాగే! నంటూ కదిలాడు. వాడితోపాటు వెళ్ళిపోయినట్లు వెలుతురు పూర్తిగా పోయి చీకట్లు కమ్ముకుతున్నాయి.

బంగార్రాజు ఆవూరికి మునసబు.

పూళ్ళోని ఆ మాత్రం, ఈ మాత్రం కాస్త నోరున్న మనుషు ల్నందర్నీ పోగు చేసుకుని వాళ్ళకవీ ఇవీ పనులు చేసి తన మనుషులుగా మార్చుకున్నాడు.

పూరి చివరినున్న శివాలయం మెట్టుమీద ఉత్సవాలు మొదలుకుని, పూళ్ళో ఏ చిన్నపనైనా బంగార్రాజు లేకుండా జరగడానికి వీల్లేదు. అతని మాటకు తిరుగులేదు.

మామూలుగా తెల్లవారింది. పూరి చివర శివాలయంలోని పూజారి ఏవేవో పూజలా, అభిషేకాలా చేయిస్తున్నట్లుగా, అక్కడ అమర్చిన మైకు లోంచి పెద్ద ధ్వనితో పూళ్ళోకి వినిపిస్తున్నాయి ఉదయాన్నే.

బంగార్రాజు అప్పటికే తయారై పోయాడు. జరీ అంచు పొందూరు పంచ కట్టుకుని, పాల నురుగు వంటి చొక్కా ధరించాడు. మెళ్ళోని గొలుసు పైకి తీసి వేసుకున్నాడు. చేతికున్న బంగారపు ఉంగరాలు తళ తళ మెరుస్తున్నాయి. తలంటి స్నానం చేశాడేమో చిన్నగా వస్తున్న గాలికి ముంగురులు ఎగరసాగాయి.

బంగార్రాజు శివాలయం వేపు కదిలాడు.

భక్తుల సందోహంకూడా పెరిగింది. తెల్లారగన్నే ఆలయం లోనికి వెళ్ళి పూజలు చేసుకునే వాళ్ళు, మొక్కులూ వగైరా ఉన్న వాళ్ళూ, మెట్లమీదుగా శివాలయం దగ్గరకు పోసాగారు.

మునసబు బంగార్రాజుగారు స్వయంగా శివాలయంలోని శివుడి దర్శనానికి వస్తున్నారని తెలిసి పూజారీ, తదితర సిబ్బందీ గర్భగుడి ఎదురుగా ఉన్న ధ్వజ స్తంభం దగ్గర నుంచుని ఎదురు చూడసాగారు.

శివాలయం మెట్ల వరకూ వచ్చాడు బంగార్రాజు.

అక్కడంతా ముష్టివాళ్ళు కూర్చున్నారు. కన్ను వంక దగ్గరి నుంచి కాలు సేతులు లేని కుంటి వాళ్ళ వరకూ చాలామంది కనిపించారు. అతడి కంటికి. అప్పుడే జ్ఞాపకం వచ్చింది బంగార్రాజుకు— రాత్రి తన అగ్గరి కొచ్చి జాగా విషయమై మొర పెట్టుకున్న కుంటి ముష్టివాడి గురించి. అక్కడున్న వాళ్ళందర్నీ నిశితంగా పరిశీలించాడు. రాత్రి వచ్చిన కుంటి ముష్టి మనిషికూడా అక్కడే ఉన్నాడు. రోజూ అతడు కూర్చునే జాగాలో మరొక్కడెవరో కనిపించాడు. ఆ మనిషికి ఏ లోపమూ లేదు. అన్నీ బాగానే ఉన్నాయి. కాకపోతే గెడ్డం బాగా మాసి ఉంది. తైలసంస్కారం లేక జుత్తు ఎండి అట్టలు గట్టి ఉంది. వేసుకున్న చింకి బనీను కన్నాల్లోంచి లోపల శరీరం చుక్కలు చుక్కలుగా నల్లగా కనిపిస్తూంది. వాణ్ణి ఒకింత సేపు చూసి తల వూపి ముందుకు కదిలాడు బంగార్రాజు.

బంగార్రాజు కో అలవాటుంది. ఎప్పుడు ఆ శివాలయానికి వచ్చినా జేబులోంచి, చేతి కెంత వస్తే అంత డబ్బు తీసి లెక్క పెట్టకుండా, అక్కడ ఉన్న పూజారి చేతిలోని 'హారతి' పళ్ళెంలో వేసి దండం పెట్టుకోవడం అలవాటు. ఆ వెనక బంగార్రాజు నెత్తిమీద శటగోపం పెట్టడం పూజారికీ అలవాటు.

కాని ఆ రోజు బంగార్రాజు అలవాటును మార్చేశాడు. జేబులోంచి డబ్బు తీసి అంతా చూస్తూండగా పాతిక రూపాయలు లెక్క పెట్టి పూజారి పళ్ళెంలో ఉంచాడు. శటగోపం తేబోయాడు పూజారి.

"అఖ్కర్లేదు లేవయ్యా! ఇన్నాళ్ళూ నాకు శటగోపం పెడుతూనే ఉన్నావుగా! అది చాల్లే" అన్నాడు.

"అమ్మమ్మ! ఎంత మాట? తమ లాంటి ధర్మ ప్రభువులు ముందు మే మెంత?" అంటూ వినయ రాగాలు తీస్తున్న పూజారిని ఆపాడు బంగార్రాజు.

కింద మెట్ల దగ్గరున్న ముష్టాడి దృష్టి అంతా బంగార్రాజు మీదనే ఉంది. బంగార్రాజుతోపాటు వెనగ్గా వచ్చిన చాలామంది భక్తులు వెళుతూ వెళుతూ వేసిన ధర్మంకూడా తన స్థానంలో ఉన్న కొత్త ముష్టాడికే అందాయి. వాడికి నయాపైసా కూడా లేదు. దాంతో ఏడుపొచ్చింది. కిందకు దిగి వచ్చేటప్పుడేనా బంగార్రాజుగారు తనకు న్యాయం చెప్పి, ఆ కొత్త ముష్టాడిని పొమ్మంటాడని భావించాడు.




తల వెంట్రుకలు రాలుటకు కారణము పేలు

పేలను, ఈరులను నశింపజేయుటకు కెన్జ్ వాడండి. సువాననతోకూడిన పేలనాశిని కెన్జ్ హెయిర్ ఆయిల్‌ను వాడి మీ కేశములను కాపాడుకొనండి.

కెన్జ్

పేలనాశిని మందు

దీనిలో ఈరులను నశింపజేయు బెన్‌జోకెయిన్ ఉన్నది.

నిర్భయముగా వాడుటకు వీలైనది.




PHARM PRODUCTS

ఫార్మ్ ప్రోడక్ట్స్

తంజావూరు-613 007 తమిళనాడు

అన్ని జిల్లాలకు డిస్ట్రిబ్యూటర్లు కావలెను.

Chhaya/PP/222

తను ఆ స్థలంలో కూచుందుకు ఏ ఏ రోజు ఎంతెంత డబ్బులు బంగార్రాజు కాళ్ళ దగ్గర పోశాడో గుర్తుకు తెచ్చుకోసాగాడు.

తన వెనకే ఉన్న మనుషులతో పాటుగా మెట్లు దిగసాగాడు బంగార్రాజు. వెనకనున్న మనుషులు కూడా బంగార్రాజు పట్ల గౌరవంగానే అతని వెనగ్గా దిగసాగారు. కుంటి ముష్టి వాడున్న చోటు వరకూ వచ్చాడు బంగార్రాజు. చటుక్కున ఒక అయిడియా వచ్చింది బంగార్రాజుకు. జేబులోంచి ఒక అయిదు రూపాయల నోటు తీసి అక్కడ కుంటి ముష్టాడి స్థానంలో ఉన్న కొత్త ముష్టాడి చేతిలో పెట్టాడు. బంగార్రాజు వేశాడు గదాని, వెనగ్గ ఉన్న జనం తలా రూపాయి, రెండు వేశారు.

బంగార్రాజు మాత్రం ఎవరి వంకా చూళ్ళేదు. తిన్నగా నడుచుకుంటూ ఫూళ్ళోకి పోయాడు. కుంటి ముష్టాడి కళ్ళల్లో నీళ్ళు ఉబికాయి.

సాయంత్రం అయింది.

బంగార్రాజు పెట్టిన కబురందుకుని కొత్త ముష్టాడు బంగార్రాజు ఇంటి ముందు కొచ్చి నించున్నాడు.

చేతిలో అయిదు రూపాయ లుంచి, మిగతా జనంకూడా తలా కొంత ధర్మం చెయ్యడానికి అవకాశం కల్పించి, తన ఆదాయం ఎక్కువ చేసిన బంగార్రాజు పిలిస్తే మానెయ్య లేక పోయా డా కొత్త ముష్టాడు.

వాడికి బంగార్రాజు పైన విపరీతమైన గౌరవం ఏర్పడిపోయింది. అనవసరంగ, అన్యాయంగా, బంగార్రాజు వంటి పెద్ద మనిషిని తిట్టుకున్నానని పశ్చాత్తాప పడి వచ్చాడు.

అయినా ఆ రోజే ఎందుకు రమ్మని కబురంపాడో నన్న శంక మాత్రం మనసులో ఒక పక్క పీకుతూనే ఉంది.

బంగార్రాజు తాపీగా వాలుకుర్చీలో కూర్చుని చుట్ట కాల్చుకుంటున్నాడు. ఎదురుగా వచ్చి నించున్న కొత్త ముష్టాడి వంక చూశాడు.

"దండాలు, బాబూ! తమకు కబు రంపినారని వచ్చానండి.!" వినయంగ అన్నాడు వాడు.


"నువ్వేనా కుంటి ముష్టాణ్ణి గెంటేసి, వాడి జాగాలో కూర్చుంది?" గంభీరంగా స్వరం పెట్టి అన్నాడు బంగార్రాజు.

"అవును, బాబయ్యా! నేనేనండి. కసింత చోటివ్వ మన్నానండి. యివ్వాల్లేదూ, నా నొక్కన్నే యిక్కడుండాలని దబాయించినాడండి ... బతి మాలినానండి... ఈల్లేదు పొమ్మన్నా డండి! అంచేత వాడిని లాగి కూకున్నానండి. ఆడూ ముష్టోడే, నానూ ముష్టోడినే గదాండి... కసింత జాగా ఇస్తే ఏటయి పోతదండి?!"

జాగ్రత్తగా, మెల్లగా బంగార్రాజు క్కోపం రాకుండ అన్నా డా మాటల్ని.

"అవున్రా! వాడికొచ్చే ఆదాయం నువ్వు చెడగొట్టినావుగా మరి! ! వాడికేసే ధర్మం నువ్వు దక్కించుకున్నావు. అదీ వాడి బాధ ... అది సరే! ఇవ్వేళ ఎంతొచ్చింది ఆదాయం నీకు? ..."

హఠాత్తుగా తన ఆదాయం గురించి బంగార్రాజు వాకబు చేసేసరికి ఆ కొత్త ముష్టోడికి చెమటలు పట్టినాయి. ఎక్కువ సెబితే ఏటవుద్దో, ఏదంటే ఏటవుద్దోనని బెంగపడిపోయాడు.




"ఎంతుంట దండి! ఇయ్యాల మీనాటి దరమ సెబువులు జాలిపడి ఏసేరుగాబట్టి, ఎనకతాల జనం ఏసేరండి. అంతాకలిపి నో యాబై రూపాయల సిల్లర పోగయినా దండి." నిజాన్ని టక్కున చెప్పాడు.

ఆశ్చర్యపోయాడు బంగార్రాజు.

నో ముష్టోడి పళ్ళెంలో రోజుకి యాభై రూపాయలా? ఆ దేవుడికే గాదు, పట్నంలో ఉద్యోగం చేస్తున్న తన కొడుక్కి కూడా అంతుం డదే?! ... ఈ లెక్కన ఈ దేశంలో ఉన్న ముష్టో ళ్ళంతా ఆదాయపరులే నన్నమాట! ఉద్యోగాలుచేసే ఉద్యోగస్తులూ, భూమిదున్ని పంటలు పండించే రైతులూ ముష్టోళ్ల ముందు ఎందుకూ పనికి రారన్న మాట.

బంగార్రాజు ఆలోచన్ల కంతరాయం కల్గిస్తూ "నానెల్తానండి! సెలవిప్పించండి!" అన్నా డా కొత్త ముష్టివాడు.

"వెళ్దువుగాని ... కాస్సేపాగు ... చూడొరేయ్! ఇవ్వాళ గుడికాడికి ఒచ్చేనం టే ఎందుకోసమంటావ్?" సూటిగా అడిగాడుబంగార్రాజు.వాడేంమాట్లాడలేదు.

"ఆ దేవుడి మీద భక్తి అనుకున్నావా? రోజూ చూస్తున్న దేవుడికోసం ఉన్న పనులన్నీ వదిలి, అంత దూరం నడిచి రావడానికి నేనేం తెలివితక్కువ మని షినేం గాదు. అదీగాక పూజారి హారతి పళ్ళెంలో పాతిక రూపాయలు వేసేనం టే ఉత్తినే కాదు. మరి ఇదంతా ఎందుకోసమంటావ్?" అగేడు బంగార్రాజు.

ఈ సారికూడా వాడు మాట్లాడ లేదు. కనీసం మాట్లాడేందుకు ప్రయత్నించ లేదు.

"అదంతా నిన్ను చూడ్డంకోసం. నన్నే ఎదిరించిన మనిషి ఎవుడై ఉంటాడా అని చూడ్డం కోసం. పాతిక రూపాయలు ఖర్చు పెట్టానం టే అది పైకి. లోపల చెప్పాలం టే అంత కంత ఆదాయం లేకపోతే ఉత్తినే పెట్టడం నా కిట్టం లేదు. అందుచేత."

బంగార్రాజు ఆగి వాడి వంక చూశాడు. మళ్ళీ అన్నాడు.

"అందుచేత ఏటం టే, ఇవ్వాళ నీ కొచ్చిన ఆ యాభై రూపాయలూ నాకు పెట్టుబడి పెట్టా వం టే, రోజూ రోజూ నీ కంత ఆదాయం వచ్చేటట్లు చూసే పూచి నాది. గుడి దగ్గిరి కొచ్చిన దేవుడి భక్తు లందరూ నీ పళ్ళెంలోనే ధర్మం వేసే ఏర్పాటు చేసే పూచి నాది. ఏమంటావు?"

ఆగి చూశాడు బంగార్రాజు.

అతను అడిగేదీ, చెప్పేదీ, చెప్పబోయేది పూర్తిగా అర్థం అయిపోయింది వాడికి. దేవుడి ఆదాయంలోనే కాదు, గుడిదగ్గిర అడుక్కునే ముష్టాళ్ల ఆదాయంలో భాగం పంచుకునే బంగార్రాజు లాంటి మనుషు లుండబట్టే ఈ దేశంలో ధర్మం చెరసాలల్లో ఏడుస్తూందనుకున్నాడు కాస్సేపు. ఇటువంటి పరి స్థితుల్లో ముందుగా ఒప్పుకోవడమే మంచిదని అనిపించింది వాడికి. సంచిలోని యాభై రూపా యల చిల్లరా తీసి బంగార్రాజు కాళ్ళ దగ్గర కుప్పలా పోశాడు.

"సెబువులు. గుడి లోపల దేవుడున్నాడని అంతా అంటారు కాని, గుడి బయట నోగిట్లో మీనాటి పరమాత్ములుంటారని ఇప్పుడే నాకు తెలిసింది బాబూ! తమరు తలుచుకుం టే ఆ దేవుడుకూడా తిరగబడ కుండ సేసేగ్రలు! మీ గ్గాని కోపం వస్తే, ఆ దేవుని ఆదాయంకూడా పడిపోతదని తెలిసింది. మరంచేత ఇప్పుడే సిల్లరంతా తీసుకుని ఆ దేవుని గుడి కాడ నాకు జాగా చూపించి పున్నెం గట్టుకోండి బాబూ!"

రెండు చేతులూ జోడించి అన్నా డా కొత్త ముష్టివాడు. బంగార్రాజు వాడి వేపు గర్వంగా చూశాడు.

"ఇంక నువ్వెళ్ళు! వెళ్ళి, నీకు నచ్చిన దగ్గర, బాగా ధర్మం వచ్చే దగ్గర కూచో. ఎవరన్నా ఏవన్నా అంటే నా పేరు చెప్పు" అన్నాడు.

వాడు కదల బోయాడు అలాగేనని తల వూపుతూ.

మళ్ళీ పిలిచాడు బంగార్రాజు. "ఒరే! నీకు నచ్చిన దగ్గర కూచోమన్నానని జెప్పి, ఏకంగా గర్భగుడిలో కూచోకు! అక్కడ పూజారి పంతులున్నాడు. శఠగోపం పెట్టెయ్య గలడు! మరో చోట ఎంచుకో!" అన్నాడు బంగార్రాజు.

అలాగేనంటూ తల వూపుతూ కదిలాడా కొత్త ముష్టాడు.

కాళ్ళ దగ్గర పోగయి ఉన్న చిల్లర వంక ఒక మారు చూసి, తీసి లెక్క పెట్టుకుంటూ బయటకు చూశాడు బంగార్రాజు.

ఈ సారి చీకట్లు పూర్తిగా కమ్ముకున్నాయి.

*